సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 25 । డిసెంబర్ । 2022



గండిపోశమ్మ ఆలయ పరిరక్షణకు చర్యలు IIలో



వినియోగదారుల చట్టాలపై అవగాహన IIలో

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు IIలో



న్యూస్‌రీల్

పాపికొండల విహారానికి పోటెత్తిన పర్యాటకులు



పాపికొండల విహారానికి బయలుదేరుతున్న పర్యాటక బోటు

దేవీపట్నం: పాపికొండల అందాలను వీక్షించేందుకు పర్యాటకులు పోటెత్తారు. వారాంతం కావడంతో దేశం నలుమూలల నుంచి పర్యాటకులు వాహనాల్లో పోశమ్మగండికి తరలివచ్చారు. పర్యాటక శాఖకు చెందిన సర్‌ఆర్థర్ కాటన్ బోటుతో పాటు మరో ఎనిమిది ప్రైవేట్ బోట్లలో 587 మంది పర్యాటకులు పేరంటపల్లికి వెళ్లారు. భద్రత ప్రమాణాల మధ్య పర్యాటకబోట్లలో పాపికొండలకు బయలుదేరారు. సాయంత్రం నిర్దేశించిన సమయానికి తిరిగి పోశమ్మగండికి చేరుకున్నారు.

చాపరాయిలో సందడే సందడి



చాపరాయి జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద మైదాన ప్రాంతం నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. చెట్ల కింద వనభోజనాలు చేస్తూ కనిపించారు. చాపరాయిలో విక్రయిస్తున్న బేంబూ చికెన్, కబాబుల అమ్మకాలు భారీగా జరిగాయి.

పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాలకు పతకాల పంట

స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



పతకాలు సాధించిన ఏకలవ్య విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు 2022–2023 జాతీయస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో పతకాలు సాధించారు. విజయవాడలో ఈనెల 17 నుంచి 22 వరకు జరిగిన జాతీయ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో 22 రాష్ట్రాలు పాల్గొన్నాయని ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. వీటిలో పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన 71 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 64 మంది పతకాలు సాధించారు. 30 మంది బంగారు, 16 మంది సిల్వర్ , 18 మంది బ్రాంజి పతకాలు సాధించారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎయిర్‌పోర్టులో హెల్ప్ డెస్క్

సాక్షి, విశాఖపట్నం: కోవిడ్ మహమ్మారి మళ్లీ ఉధృతమవుతుందన్న వార్తల నేపథ్యంలో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ ఎయిర్ పోర్టుకు విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో రెండు శాతం మందికి కోవిడ్ పరీక్షలు (ఆర్‌టీపీసీఆర్) నిర్వహించాలని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ విమానాశ్రయంలో శనివారం ఈ హెల్ప్ డెస్క్ ఏర్పాటైంది. విదేశీ ప్రయాణికులకు నిబంధనల మేరకు కోవిడ్ పరీక్షలు, థర్మల్ స్క్రీనింగ్ చేస్తారు. ఇందుకవసరమైన రిజిస్ట్రేషన్ డెస్క్, శాంపిల్ కలెక్షన్ బూత్‌లతో పాటు ఇతర అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్టు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రాణవాయువు పుష్కలం

జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఆక్సిజన్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో కోవిడ్ కేసులు భారీగా నమోదైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం పాడేరు జిల్లా ఆస్పత్రి, అరకు, రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రుల్లో జగనన్న ప్రాణవాయువు పేరిట యుద్ధప్రాతిపదికన ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో నిర్మిస్తున్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ వారం రోజుల్లో అందుబాటులోకి రానుంది.

- కోవిడ్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తం
- గతంలోనే ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- వారం రోజుల్లో అందుబాటులోకి రానున్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్



పాడేరు జిల్లా ఆస్పత్రిలోని వార్డులో అన్ని పడకలకు ఏర్పాటుచేసిన ఆక్సిజన్ పరికరాలు



పాడేరు జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్

సాక్షి,పాడేరు: గతంలో ఏజెన్సీలోను కోవిడ్ కేసులు భారీగా నమోదవ్వడం, మరణాలు కూడా చోటుచేసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపాదికన ఆక్సిజన్ సేవలను గత ఏడాది పెద్దాసుపత్రులకు అందుబాటులో తెచ్చింది. సుమారు రూ.30లక్షల వ్యయంతో వైద్య విధాన పరిషత్ పాడేరు జిల్లా ఆస్పత్రి, అరకులోయ, రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రుల్లో జగనన్న ప్రాణవాయువు పేరిట ఆక్సిజన్ ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చింది. అప్పట్లో కోవిడ్ కేసులు తీవ్రత నేపథ్యంలో ఆక్సిజన్ ప్లాంట్ సేవలు రోగులకు ఎంతో మేలు చేశాయి. ప్రాణవాయువు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నందున మరణాలను వైద్య బృందాలు నిరోధించగలిగాయి. మూడు ఆస్పత్రులకు శాశ్వతంగా ఆక్సిజన్ ప్లాంట్లను నిర్మించి, ప్రభుత్వం గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేసింది. ప్రస్తుతం పాడేరు జిల్లా ఆస్పత్రిలో అదనంగా లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మిస్తోంది. మైదాన ప్రాంతాల నుంచి ట్యాంకర్ ద్వారా ఆక్సిజన్‌ను తీసుకువచ్చి ఈ ట్యాంక్‌లో నిల్వ ఉంచనున్నారు. వారం రోజుల్లో ఈ ప్లాంట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

500 పడకలకు..

మొదటి విడతలో కోవిడ్ తీవ్రతను దృష్టిలో పెట్టుకున్న వైద్య ఆరోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డు గదులలోని అన్ని మంచాలకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. ప్రతి పడకకు ప్రాణవాయువు అందుబాటులో ఉంచే ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు, వైద్యబృందాలు ఎంతో శ్రమించాయి.కోవిడ్ నేపథ్యంలో చేపట్టిన చర్యలు ప్రస్తుతం 24గంటల పాటు ఆక్సిజన్ సేవలకు దోహదం చేసింది. పాడేరు జిల్లా ఆస్పత్రిలోని 200 ,అరకులోయలోని ప్రాంతీయ ఆస్పత్రిలోని 150, రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రిలో 150 పడకలకు నిరంతరం ప్రాణవాయువు సౌకర్యం అందుబాటులో ఉంది. ఎలాంటి అనారోగ్య సమస్యలతో నైనా ఈ ఆస్పత్రులకు చేరిన రోగులకు ఆక్సిజన్ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుంచి రిఫరల్ కేసులన్నీ పాడేరు జిల్లా ఆస్పత్రి, రంపచోడవరం, అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రులకే తరలిస్తారు. ఈనేపథ్యంలో ఈ మూడు పెద్దాసుపత్రులలో ఆక్సిజన్ సేవలను ప్రభుత్వం విస్తృతం చేసింది. గత రెండేళ్ల నుంచి విశాఖ కేజీహెచ్, కాకినాడ జీజీహెచ్‌లకు రిఫరల్ కేసులు కూడా క్రమేపి తగ్గాయి.

సీహెచ్‌సీలకు ఆక్సిజన్ సేవలు

ఆక్సిజన్ ప్లాంట్లు నిర్మాణాలు లేని కమ్యూనిటీ ఆస్పత్రులకు ఆక్సిజన్‌ను సిలెండర్ల ద్వారా ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.జిల్లాలోని ముంచంగిపుట్టు, చింతపల్లి, చింతూరు, కూనవరం, వై.రామవరం, అడ్డతీగలలోని కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పరికరాలు ఉన్నాయి. దీంతో ఆయా వార్డు గదులలో ఆక్సిజన్ సిలెండర్ల కొరత లేకుండా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచారు.ఈ కమ్యూనిటి హెల్త్ సెంటర్లలో కూడా ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణానికి ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

అత్యవసర వైద్యానికి సిద్ధం



జిల్లాలోని పెద్దాస్పత్రులు, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కూడా నిరంతరం ఆక్సిజన్ సౌకర్యం రోగులకు అందేలా చర్యలు చేపట్టాం. పాడేరు, రంపచోడవరం, అరకులోయ ఆస్పత్రుల్లో 500 పడకలకు ఆక్సిజన్ సౌకర్యం ఉంది.ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను అదనంగా ప్రభుత్వం మంజూరు చేసింది. 24 గంటల పాటు అత్యవసర వైద్యం లక్ష్యంగా వైద్యబృందాలు పనిచేస్తున్నాయి. కోవిడ్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తమయ్యాం.

–డాక్టర్ శంకరప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్, పాడేరు

క్రిస్మస్ కాంతులు

వేడుకలకు ముస్తాబైన చర్చిలు • అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు ప్రారంభం



పద్మాపురం జంక్షన్‌లో ముస్తాబైన ప్రార్థనా మందిరం

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ పండగకు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. ఏజెన్సీలో పురాతన, ప్రథమంగా కెనడా దేశస్తుడు డాక్టర్ రాల్ఫ్‌స్మిత్ నిర్మించిన సుంకరమెట్ట చర్చితో పాటు, అరకులోయ, అనంతగిరి, హుకుంపేట మండలాల్లోని లూథరన్ దేవాలయాల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. సీబీఎం,ఆర్‌సీఎంతో పాటు, ఇతర అన్ని సంఘాలకు చెందిన ప్రార్థనా మందిరాలలో ఈ ఏడాది కూడా క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం నుంచి క్రిస్మస్ తాత వేషధారణతో క్రైస్తవ సోదరులు, చిన్నారులు క్రైస్తవ నగర సంకీర్తనలతో అలరించారు. జిల్లా కేంద్రమైన పాడేరులో పాస్టర్ తిమోతి ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు.కారుణ్య ప్రార్థన మందిరంతో పాటు,అన్ని చర్చిలు విద్యుత్ అలంకరణ చేపట్టారు. పద్మాపురం జంక్షన్‌లోని ఆర్‌సీఎం చర్చితో పాటు,అనేక ప్రార్థనా మందిరాలలో శనివారం రాత్రి నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి.



అరకులోయ ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

క్రిస్మస్ శుభాకాంక్షలు

క్రిస్మస్ పండగ పురస్కరించుకుని ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి, కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ జిల్లాలోని క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



చర్చిలో క్రిస్మస్ అలంకరణ



పాడేరులో నగర సంకీర్తన నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు

మన్యం గజగజ



కిండంగిలో చలిమంట కాగుతున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత నెలకొంది. చింతపల్లిలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి.శనివారం ఉదయం 4.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో చింతపల్లి ప్రాంతవాసులు వణికిపోయారు. చింతపల్లి కన్నా అత్యంత శీతల ప్రాంతమైన లంబసింగిలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే పరిస్థితి ఉందని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు పేర్కొన్నారు. చింతపల్లి, తాజంగి,లంబసింగి ప్రాంతాలను సందర్శించిన పర్యాటకులంతా చలితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కురవనప్పటికీ చలి ప్రజలను భయపెట్టింది.అలాగే అరకులోయ, పాడేరు మండలం మినుములూరు ప్రాంతాల్లో 9 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభించడంతో పర్యాటకులతో పాటు,గ్రామాల్లో గిరిజనులంతా చలిమంటలను ఆశ్రయించారు. అలాగే మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో రాత్రి నుంచి జనసంచారం తగ్గింది. చలి తీవ్రతకు ప్రజలకు ఇళ్లకు పరిమితమయ్యారు.

బాధ్యతగా పాఠ్యాంశాల బోధన

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ సూచన



పదవ తరగతి ఎకడమిక్ క్యాలెండర్లను హెచ్‌ఎంలకు అందజేస్తున్న డీఈవో రమేష్

రాజవొమ్మంగి: విద్యార్థులకు మనసు పెట్టి పాఠాలు బోధించి, వారిని ఉన్నతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ సూచించారు. మొదటివిడత నాడు–నేడు పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇన్వాయిస్‌లు, పెండింగ్ బిల్లుల అప్‌లోడ్‌కు సంబంధించి శనివారం ఆయన మండలంలోని ప్రధానోపాధ్యాయులతో స్థానిక విద్యావనరుల కేంద్రంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో రాజవొమ్మంగి మండలం బాగా వెనుకబడి వుందని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బోధనను హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం బైజూస్ యాప్ పొందుపరచిన అధునాతన ట్యాబ్‌లను ఎస్డీ కార్డులతో సహా అందించిందన్నారు.అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా పాఠ్యాంశాలను ఆకళింపు చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. ఇకనుంచి అధికారుల బృందం బోధనను నిత్యం పర్యవేక్షిస్తుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ఉమ్మడి జిల్లాల పర్యవేక్షణలో ఉంటుందన్నారు. హైస్కూళ్లకు సంబంధించిన ఎకడమిక్ క్యాలెండర్‌ను, బైజూస్ ఎస్‌డీ కార్డులను హెచ్‌ఎంలకు అందజేసారు. ఎంఈవో తాతబ్బాయిదొర పాల్గొన్నారు. సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 817 పాఠశాలలు, 130 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 కళాశాలల్లో నాడు–నేడు రెండవ దశ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 80శాతం పనులు పూర్తికాగా, సుమారు రూ.3.8 కోట్ల నిధులు విడుదల చేశామని ఆయన వివరించారు.

నిరుద్యోగ గిరి యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

అడ్డతీగల: నిరుద్యోగ గిరి యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి పి.రోహిణి తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలోని గిరిజన యువతీ, యువకులకు అసిస్టెంట్ బ్యూటీషియన్ థెరపిస్ట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ మూడు మాసాల పాటు శిక్షణ ఇస్తామని ఆమె పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన అనంతరం రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోశిక్షణ ఇస్తామన్నారు.అసిస్టెంట్ బ్యూటీషియన్ థెరపిస్ట్ కోర్సులో శిక్షణకు విద్యార్హత టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకున్న మహిళలు అయ్యి ఉండాలన్నారు. వయసు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులన్నారు.

జనరల్ డ్యూటీ అసిస్టెంట్ శిక్షణ పొందడానికి టెన్త్ ఆపైన చదువుకుని ఉండాలన్నారు.18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు గల స్త్రీ,పురుషులు అర్హులన్నారు. నాన్ రెసిడెన్షియల్ శిక్షణగా వీటిని పేర్కొంటారన్నారు.అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై తర్ఫీదు ఇస్తారన్నారు.ఎన్ఎస్‌డీసీ, ఏపీఎస్ఎస్‌డీసీ సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు,ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.శిక్షణ పూర్తి అయిన తరువాత ప్రముఖ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు.

మాస్క్ తప్పనిసరి

రేపటి నుంచి పీహెచ్‌సీల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు

రాజవొమ్మంగి: కోవిడ్ కొత్త వేరియంట్ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని రాజవొమ్మంగి, జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు సుజి, లిఖిత కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కోవిడ్ ఒమిక్రాన్ బీఎఫ్ –7 వేరియంట్ కేసులు కొన్ని ప్రాంతాల్లో వస్తున్న నేపథ్యంలో ప్రజలు గుంపులు గుంపులుగా ఉండవచ్చని సూచించారు. పండగ సీజన్ కావడంతో ప్రతి ఒక్కరు అప్రమత్తతతో మెలగాలని కోరారు. మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్‌సీల్లో సోమవారం నుంచి కోవిడ్ లక్షణాలు ఉన్నవారికి నిర్ధారణ పరీక్షలు చేస్తామని వారు పేర్కొన్నారు. కోవిడ్ పట్ల ఆందోళనకు గురి కావద్దని, అధికార యంత్రాంగం సూచనలు పాటించి సురక్షితంగా ఉండాలని వారు కోరారు.


అర్హులందరికీ పింఛన్లు

- పింఛనుదారులకు నోటీసుల జారీపై అపోహలొద్దు
- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

పాడేరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి అర్హతే ప్రామాణికంగా పింఛన్ మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అన్నారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయం అమరావతి నుంచి ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్‌దారులకు ఇస్తున్న నోటీసులపై ఎటువంటి అపోహలు వద్దని సూచించారు. జిల్లాలో 2023 జనవరి నుంచి కొత్తగా మరో 5,398 మందికి పింఛన్లు మంజూ య్యాయని చెప్పారు. పింఛన్ పొందుతున్న వారిలో 3,905 మందికి నోటీసులు జారీచేసినట్టు తెలిపారు. వీటిని అందుకున్న వారు 18 రోజుల్లోగా వారి అర్హతలను తగిన అధారాలతో సమర్పిస్తే పింఛన్ పునరుద్ధరిస్తామన్నారు. జిల్లాలో 1,513 మంది లబ్ధిదారులకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరైనట్టు ఆయన వెల్లడించారు. వీరంతా ఈనెల 26లోపు సంబంధిత గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వద్దకు వెళ్లి బయోమెట్రిక్ వేసి జనవరి పేం,ఇ రేషన్ సరుకులు పొందవచ్చన్నారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్నా యోజన పథకంలో ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమైందన్నారు. ఇప్పటి వరకు కందిపప్పు, పంచదార తీసుకోని లబ్ధిదారులు ఈనెలఖరు వరకు తీసుకోవచ్చని సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివ ప్రసాద్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచన



భీరంలో రీసర్వే భూములను పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

జి.మాడుగుల: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్ గోపాలకృష్ణ ఆదేశించారు. మండలంలో భీరం పంచాయతీ కేంద్రంలో శనివారం రీసర్వే చేస్తున్న భూములు, సర్వే విధానాన్ని ఆయన పరిశీలించారు. సర్వే బృందం రోజుకు 40 హెక్టర్లలో రీసర్వే చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.అప్పలస్వామిని ఆదేశించారు.

క్లుప్తంగా

పరామర్శకు వెళ్లి పరలోకానికి..

ఆటోలోంచి జారి పడి వ్యక్తి మృతి

గంగవరం: ఆటోలోంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గంగవరం శివారులో శనివారం సాయంత్రం జరిగింది. వివరాలను స్థానిక ఏఎస్ఐ రజాక్ శనివారం రాత్రి విలేకర్లకు వివరించారు. కొయ్యూరు మండలం కొత్తురమ్మపేట (కొత్తూరు)కు చెందిన కె. నూకరాజు(50) కాకినాడ జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో తమ బంధువుల ఇంటికి దినకార్యానికి పరామర్శకు ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పాత గంగవరం శివారులో ఆటోలో వెనుక భాగంలో కూర్చున్న నూకరాజు కిందికి జారి పడిపోగా తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

గంజాయి ముఠా అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

దొండపర్తి(విశాఖ దక్షిణ): నగరంలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి 124 కేజీల గంజాయి, రూ.10,180 నగదు, ఒక కార్, 11 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైలాసగిరి రోప్‌వే వద్ద హెల్త్ ఎరీనా పార్కింగ్ ప్రాంతంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి వద్ద 124 కేజీల గంజాయిని గుర్తించడంతో అనంతగిరి మండలానికి చెందిన శెట్టి ఉమామహేశ్వరరావు, శెట్టి వెంకట్రావు, హుకుంపేటకు చెందిన వంతల రాంబాబు, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కల్వేంద్ర ఛాహర్, అనుజ్‌కుమార్, పంజాబ్‌కు చెందిన విజయకుమార్‌తో పాటు ఒక మైనర్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయితో పాటు రూ.10.180 నగదు, ఒక కారు, 11 మొబైల్స్ స్వాధీనం చేసుకొని వారిని ఎంవీపీ పోలీసులకు అప్పగించారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన

- వాడవాడలా అవగాహన ర్యాలీలు
- ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం



వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు నానీపాత్రుడు



వై.రామవరంలో విద్యార్థుల మానవహారం

పాడేరు రూరల్: వినియోగారుల చట్టం ప్రతి వినియోగదారుడికి రక్షణగా ఉంటుందని ప్రతి ఒక్కరు వినియోగదారుని చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు లకే నానీపాత్రుడు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జిల్లా వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం పాడేరులో పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదు పొందాలన్నారు. వినియోగంలో అసౌకర్యం ఉంటే తక్షణమే వినియోగదారుల ఫోరంనకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. వినియోగదారుల సంఘం ప్రతినిధులు బైరాగిమూర్తి, వెంకటరమణ, త్రినాథ్, పరమేశ్వరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



చింతపల్లిలో రమణను సన్మానిస్తున్న వినియోగ దారుల సంఘం రాష్ట్ర నాయకులు

చింతపల్లి: మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు. వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో రమణ ఎంతో కృషి చేశారన్నారు.

రంపచోడవరం: వినియోగదారుల సంఘం డివిజన్ అధ్యక్షురాలు దుక్కులూరి సంగీత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు జరిగే మోసాలను అరికట్టేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై రామవరం రాజవొమ్మంగి మండలాల నుంచి సభ్యులు పాల్గొన్నారు. వినియోగదారుల సమస్యలపై చర్చించారు. సంఘం ప్రతినిధులు షేక్ అభిఆలీ, కుమారి, వెంకటేశ్వర్లు, సిరిమల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సత్యవేణి మాట్లాడుతూ వస్తువుల నాణ్యత, వాటి సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణాలు తదితర పూర్తి సమాచారం పొందే హక్కు వినియోగదారులకు చట్టం కల్పిస్తోందన్నారు. చట్టాలను కాపాడుకోవాలన్నారు.



రాష్ట్ర కార్యదర్శిగా ఈర్లదారబాబుకు నియామక పత్రాన్ని అందిస్తున్న జాతీయ కార్యదర్శి వికాస్‌పాండే

వై.రామవరం: వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కె.సుధాకర్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీఆర్పీ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: వినియోగదారుల హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలం ఆర్.వి.నగర్‌కు చెందిన ఈర్ల దారబాబు నియమితులయ్యారు.జాతీయ వినియోగదారుల హక్కుల సంఘం నాయకులు శనివారం విశాఖపట్నంలో సమావేశమై పలువురుల నియామకాలు చేపట్టారు. వినియోగదారుల హక్కుల సంఘం జాతీయ కార్యదర్శి వికాస్‌పాండే, రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాస్, అల్లూరి జిల్లా కన్వీనర్ దూనబోయిన రమణ ఆధ్వర్యంలో నియామకాలు జరిగాయి. ఈ సంరద్బంగా దారబాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

గంజాపై పోలీస్ పంజా



గంజాయికి నిప్పు పెడుతున్న డీఐజీ హరికృష్ణ, ఎస్పీలు గౌతమి సాలి, సతీష్‌కుమార్

- భారీ ఎత్తున మాదకద్రవ్యాల ధ్వంసం
- 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పట్టుకున్న సరకు
- సత్ఫలితాలిస్తున్న 'ఆపరేషన్ పరివర్తన'
- ప్రత్యామ్నాయ పంటలు పండించే గిరి రైతులకు ప్రోత్సాహం
- ధ్వంస రచనకు సారథ్యం వహించిన డీఐజీ హరికృష్ణ

సాక్షి, అనకాపల్లి: అక్రమ గంజాయి రవాణా, సాగు నియంత్రణపై ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టామని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తరలిరాకుండా... కొన్ని ప్రధాన ప్రాంతాల్లో 14 చెక్ పోస్టులను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం కోడూరులో విశాఖ రేంజ్ పరిధిలో గల ఐదు జిల్లాల్లో పట్టుబడిన గంజాయిని ఆయన నిప్పుపెట్టి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎస్పీ గౌతమిసాలి, అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. గంజాయిని 14 గుట్టలుగా పేర్చారు. అందులో ఒక గుట్టకు డీఐజీ హరికృష్ణ నిప్పు అంటించారు. లక్షా 93 వేల కేజీల గంజాయితోపాటు 131 కేజీల హాషీస్ ఆయిల్‌ను పోలీసులు తగలబెట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో ఏపీ ప్రభుత్వం ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంతో గంజాయి సాగు, వాటి అక్రమ రవాణాలను అరికడుతూ..వాటిపై ఆధారపడి జీవించే రైతులకు ప్రత్యామ్నాయ పంటల పండించేందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు. ఆపరేషన్ పరివర్తన ద్వారా గత ఏడాది 7,500 ఎకరాల్లో గంజాయిని నిర్మూలించామన్నారు. ఈ ఏడాది మావోయిస్టు ప్రభావం ఉన్న రిమోట్ ప్రాంతాల్లో ఉన్న మరో 650 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేశామన్నారు. గతేడాది ఎక్కడైతే సాగు ధ్వంసం చేశామో ఆ ప్రాంతంలో గిరి రైతులు ప్రత్యామ్నాయ పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ల సహకారంతో గిరి రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు సీడ్స్ నుంచి అన్నింటిలోనూ సబ్సిడీ కల్పిస్తున్నామన్నారు.

మావోయిస్టు ప్రభావం తగ్గుముఖం

ఆంధ్రా–ఒడిశా ప్రాంతంలో గల ఏజెన్సీలో మావోయిస్టు ప్రభావం తగ్గుముఖం పట్టిందన్నారు. చాలా మంది జనజీవన స్రవంతిలో కలిసిపోయారని, త్వరలో మరింత మంది రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం అందించే రివార్డులతో పాటు వారి పిల్లల చదువులు, వారికి ఉపాధి కల్పన వంటి బాధ్యతలనూ కూడా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. సెబ్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ రామచంద్రరావు, అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, తుహిన్ సిన్హా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, ఏఎస్పీలు మహేశ్వర్‌రెడ్డి, కొమ్మి ప్రతాప్ కిషోర్, ఆదిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీలు సునీల్, శ్రీనివాసరావు, మళ్ల మహేష్, ఏఆర్ డీఎస్పీలు నాగేశ్వరరావు, మరియాన్‌రాజు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సమక్షంలో చేరిన 40 మంది టీడీపీ నేతలు

జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీలో భూంబొడ్డు గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సమక్షంలో టీడీపీకి చెందిన నాయకులు , 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న సుపరిపాలనను మెచ్చి పార్టీలో చేరామన్నారు. పార్టీ మరింత బలోపేతం కోసం శ్రమిస్తామన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్బ నర్సింగరావు, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్‌లు కొండబాబు, రాంబాబు, ఎంపీటీసీ సన్యాసిదొర, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, నాయకులు కళ్యాణం, కొండబాబు, వలసయ్య, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్ తదితరలు పాల్గొన్నారు.

గండిపోశమ్మ ఆలయ పరిరక్షణకు చర్యలు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న గొందూరు గిరిజనుల ఆరాధ్య దేవత మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం మూలవిరాట్టు రక్షణకు చర్యలు వేగవంతమయ్యాయి. దీనిలో భాగంగా ప్రాజెక్టు అధికారులు శనివారం ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. పోలవరం ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహమూర్తి పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ మేఘా ఇంజినీరింగ్ కంపెనీ జీఎం ముద్దుకృష్ణ, ఏజీఎం క్రాంతికుమార్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌తో కూడిన బృందం స్వయంభువు ఆలయాన్ని పరిశీలించింది. ముంపు నుంచి ఏవిధంగా రక్షణ కల్పించాలి.. నూతన ఆలయ నిర్మాణం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయం వద్ద సమావేశమై సమీక్షించారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. వారి వెంట ఆలయ ఈవో జీవీ లక్ష్మీకుమార్ తదితరులు ఉన్నారు.